ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్, ఏప్రిల్ 15 : యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కుపై అవగాహన ఉండాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు ఇందనూర్ బషీర్, నవాజుద్దీన్, కృష్ణయాదవ్, అసిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం.. వాహనదారులకు ఇబ్బందులు

బీటీ రోడ్డుపై ధాన్యం అరబెట్టిన రైతులు

బొంరాస్‌పేట, ఏప్రిల్ 15 : దుద్యాల మండల పరిధిలోని పలు గ్రామీణ రోడ్లపై ధాన్యం ఆరబెడుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గౌరారంలో రైతులు పండించిన ధాన్యాన్ని బీటీ రోడ్డుపై ఆరబెట్టుకుంటున్నారు. బాపల్లి నుంచి కొడంగల్ వెళ్లే మార్గంలో ఇలాగే ధాన్యాన్ని ఆరబెట్టారు. ఈ మార్గాల్లో వెళ్లే వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ధాన్యం కుప్పలపై ప్లాస్టిక్ కవర్లను కప్పి ఉంచుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై ధాన్యం ఆరబెడితే జరిగే ప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల

పరిగి, ఏప్రిల్ 15 : గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల సూచించారు. మంగళవారం పరిగి మున్సిపాలిటీ పరిధిలోని మున్నూరువాడ, మిట్టకోడూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన పోషణ్ పక్షోత్సవంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. పోషక విలువలు లోపిస్తే అనేక సమస్యలు ఏర్పడుతాయన్నారు. పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని చెప్పారు. గ్రామాల్లో చక్కటి పోషక విలువలు ఉండే ఆహార పదార్థాలు, సీజనల్ పండ్లు లభిస్తాయన్నారు. ఆరోగ్యంపై ఏమాత్రం అజాగ్రత్త వహించరాదని ఆమె చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ సభకు తరలిరావాలి

- బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్
- రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్, ఏప్రిల్ 15 : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గోపాల్‌ముదిరాజ్ తెలిపారు. మంగళవారం వికారాబాద్‌లో బీఆర్ఎస్ చేపట్టిన రజతోత్సవ బహిరంగ సభ, చలో వరంగల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పాలనను చూసి ప్రజలు విరక్తి చెందుతున్నారని తెలిపారు. ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభకు పట్టణ ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వికారాబాద్ పట్టణ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు అనంత్ రెడ్డి. కిరణ్ పటేల్, రమేశ్‌గౌడ్, రాము లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుభాన్ రెడ్డి, పట్టణ జనరల్ సెక్రటరీ గాండ్ల మల్లికార్జున్, మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు ముర్తుజా అలీ, సీనియర్ నాయకులు మల్లేశం, వెంకట్, దేవదాసు, మంచన్పల్లి సురేశ్, నాయకులు సురేశ్ గౌడ్, గోపి, కిశోర్, నర్సింహ, దశరథ్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండుమల్ల నర్సింహులుకు దళిత రత్న అవార్డు

అంబేద్కర్ దళిత రత్నఅవార్డును అందుకుంటున్న గుండుమల్ల నర్సింహులు

కులకచర్ల, ఏప్రిల్ 15 : మండల పరిధిలోని తిర్మలాపూర్‌కు చెందిన గుండుమల్ల నర్సింహులుకు దళితరత్న అవార్డు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులుకు అంబేద్కర్ దళిత రత్న అవార్డును నిర్వాహకులు అందజేశారు. నర్సింహులు దళిత సంఘాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు స్వచ్ఛందంగా కృషి చేశారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేశారు. అనంతరం నర్సింహులు మాట్లాడుతూ.. దళిత రత్న అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. తన సేవలకు ప్రతిఫలంగా ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. స్వచ్ఛంద కార్యక్రమాలను మరింతగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గాలయ్యను వరించిన దళిత రత్న

నవాబుపేట : మండల కేంద్రంలోని యెల్లకొండకు చెందిన బేగారి గాలయ్యకు దళిత రత్న అవార్డు దక్కింది. డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ రవీంద్రభారతీలో జరిగిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో గాలయ్యకు దళిత రత్న అవార్డును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దళితులకు అందించిన సేవాలకు అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

పీహెచ్‌సీలో సేవలు నిర్వహించడం అభినందనీయం

వైద్యులను సన్మానించిన వికారాబాద్ జిల్లా దిశా కమిటీ సభ్యుడు జానకీరాం

కులకచర్ల, ఏప్రిల్ 15 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు పేదలకు సేవలు చేయడం అభినందనీయమని వికారాబాద్ జిల్లా దిశా కమిటీ సభ్యుడు డాక్టర్ జానకీరాం అన్నారు. మంగళవారం కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి, అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సేవలు అందించే అదృష్టం వైద్యులకు ఉంటుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో నూతనంగా విధుల్లో చేరిన వైద్యులను అభినందిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్, టెలికం బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యుడు గణాపురం వెంకటయ్యగౌడ్, మండల ఉపాధ్యక్షుడు పెరుమళ్ల వెంకటేశ్, నాయకులు మహేశ్‌కుమార్, మహేశ్, శ్రీశైలం, ఆంజనేయులు, రాజు, హరికృష్ణ, చందు, పాండు, హరీశ్, డాక్టర్ మాధురిలత, డాక్టర్ కిరణ్‌కుమార్‌గౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

పరిగి : బస్టాండ్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ సేవ్యానాయక్

పరిగి, ఏప్రిల్ 15 : అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పరిగి అగ్నిమాపక కేంద్రం అధికారి సేవ్యానాయక్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పరిగిలోని బస్టాండ్‌లో అగ్నిప్రమాదాల నివారణపై ఆయన ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్లల్లో చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు, ఇతర మండే పదార్థాలు అందుబాటులో ఉంచరాదన్నారు. ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలనే ఉపయోగించాలని చెప్పారు. పాడైన వైర్లు వాడరాదని, ఓవర్ లోడ్ వేయరాదన్నారు. వంటగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ తదితర ఉంచరాదని సూచించారు. వంట చేసే సమయంలో నూలు వస్త్రాలు ధరించాలని చెప్పారు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వికారాబాద్ : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ అగ్నిమాపక అధికారి దాసాం జనేయస్వామి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వికారాబాద్‌లోని బస్ స్టేషన్, బస్టాండ్‌లో సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్నిమాపక వారోత్సవాలు ఈ నెల 14 నుం చి 20వరకు కొనసాగుతాయన్నారు. వికారాబాద్ ఆర్టీసీ బస్ స్టేషన్, బస్ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులకు అవగాహన కల్పించామన్నారు. షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ, ఆర్టీసీ ఉద్యోగులు, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ :బస్ డిపోలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కులకచర్ల, ఏప్రిల్ 15: మండల కేంద్రానికి చెందిన వార్వాల్ అంజిలయ్య కొంతకాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో ప్రభుత్వం ద్వారా వచ్చిన సీఎంఆర్ఎఫ్ చెక్కును డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రాయల యాదయ్య, వార్వాల యాదయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు కేసీఆర్‌కే సాధ్యం

నవాబుపేట, ఏప్రిల్ 15 : తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన సంక్షేమ పథకాలను తీసుకొచ్చి వాటి అమలుకు ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఫిర్దోస్ అన్నారు. మండల పరిధిలోని పులుమామిడిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కొత్త పథకాలు ప్రజలకు చేరువ కావ డం లేదన్నారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలు తప్ప, కాంగ్రెస్ చేసినవి ఏమీ లేవన్నారు. భూముల ధరలు ప డిపోయయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ముస్లిం లకు షాదీముబారక్, రంజాన్ కానుకలు అందేవని, నేడు ఆ పథకాల ఊసే లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మండల పరిధిలోని బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలి

దౌల్తాబాద్, ఎప్రిల్ 15 : మండల పరిధిలో చేపడుతున్న పాఠశాల భవన, సీసీ రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని పంచాయతీ రాజ్ డిప్యూటీ ఈఈ సుదర్శన్ రావు సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో దేవర్‌ఫస్లవాద్‌లో రూ.61లక్షల నిధులతో నిర్మిస్తున్న పాఠశాల భవన నిర్మాణం, రూ.20లక్షలతో చేపడుతున్న సబ్‌సెంటర్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మించిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఏఈ నగేందర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

17న జాబ్ మేళా

ఉపాధి కల్పనా జిల్లా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్

వికారాబాద్, ఏప్రిల్ 15 : వికారాబాద్‌లోని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, ఐటీఐ క్యాంపస్‌లో ఈ నెల 17న ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనా శాఖ జిల్లా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మాక్స్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 50 సేల్స్ అసోసియేట్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 18 నుంచి 30 ఏండ్లలోపు యువతీయువకులు అర్హులని తెలిపారు. పదో తరగతి (పాస్ లేదా ఫెయిల్) అంతకు మించి అర్హత ఉండాలన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్ 9676047444 నంబర్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

గృహ నిర్మాణానికి అనుమతి తప్పనిసరి

బెన్నూరు పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ యాదయ్య

యాలాల, ఏప్రిల్ 15 : గృహ నిర్మాణానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపీపీ యాదయ్య అన్నారు. మంగళవారం యాలాల మండల పరిధిలోని బెన్నూరు గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రేణుకను అడిగి అనుమతి లేని గృహ నిర్మాణాలు, శానిటేషన్, ప్రజల అనారోగ్య తదితర సమస్యలపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో అనుమతి లేని గృహ నిర్మాణాన్ని అడ్డుకొని పనులను నిలిపి వేయించారు. వెంటనే గృహ నిర్మాణ అనుమతులను తీసుకోవాలని గృహ నిర్మాణ యజమానికి సూచించారు. లేని పక్షంలో అక్రమ నిర్మాణంగా పరిగణించి కూల్చి వేస్తామని హెచ్చరించారు. రోడ్డుకు ఇరువైపులా ఇసుక, కంకరను పోసి వాహనదారులకు అసౌకర్యం కలిగిస్తున్న ఇంటి యజమానులకు వెంటనే వాటిని తొలగించాలని సూచించారు.

కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం కమిటీ ఎన్నిక


కమిటీ అధ్యక్షుడు రాములుగౌడ్‌ను సన్మానించిన సంఘం సభ్యులు

కులకచర్ల, ఏప్రిల్ 15 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు ఎక్సైజ్ కోఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా రాములుగౌడ్, ఉపాధ్యక్షుడిగా నీలయ్యగౌడ్, కార్యదర్శిగా యాదయ్యగౌడ్, డైరెక్టర్లుగా కె వెంకటయ్యగౌడ్, సంజయ్యగౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ అధ్యక్షుడిని సన్మానించారు. ఈ కమిటీని అందరి సమక్షంలో ఎన్నుకున్నామని ఎక్సైజ్ కోఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వీరి పదవీ కాలం 2030 ఏప్రిల్ 14 వరకు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెనూ పాటించాల్సిందే..

చైల్డ్ కేర్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, ఏప్రిల్ 15 : పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి సమీపంలో ఉన్న స్వామి గురుకుల వివేకానంద స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఐదు చైల్డ్ కేర్ సంస్థలు ఉన్నాయని, వీటిలో రెండు ప్రభుత్వానివి, మూడు ప్రైవేట్‌వి అని తెలిపారు. సెమీ అర్బన్ జిల్లా నివేదిక కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నెపల్లిలో ఉన్న స్వామి వివేకానంద స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (బాలికల) చైల్డ్ కేర్ సెంటర్‌ను తనిఖీ చేశామన్నారు. అనంతరం శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జయసుధతో కలిసి స్వామి వివేకానంద స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (బాలికల) సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. దార్మెంటరీ, వాష్ రూంలను పరిశీలించి, సెక్యూరిటీ, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా తదితర వివరాలు సంబంధిత వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు ప్రతి నెల పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి, ఏప్రిల్ 15 : పరిగి మున్సిపాలిటీ పరిధిలోని తుంకులగడ్డలో పేదల ఇండ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తుంకులగడ్డ నుంచి పరిగిలోని తహసీల్దార్ కార్యాలయం వరకు కళాకారులతో వాయిద్యాలు వాయించుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల గూడు కోసం గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇండ్లు నిర్మించుకుంటుంటే అధికారులు అడ్డుకోవడం సరికాదన్నారు. పరిగి పట్టణంలో అనేక మంది అక్రమ నిర్మాణాలు, అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. పేదలు నిర్మించుకుంటున్న ఇండ్ల వద్దకు వచ్చి అడ్డుకోవడం సరికాదని, పేదల ఇండ్లను అడ్డుకునే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల తీరు మారకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్యయ్య, రఘురాం, శేఖర్, గఫార్, శ్రీరామ్, షఫి, చంద్రమౌళి, కోటి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో కాలిబూడిదైన ఫర్నిచర్
- రూ.60 లక్షల ఆస్తినష్టం

అగ్నికి ఆహుతైన బ్యాంకులోని ఫర్నిచర్

తాండూరు రూరల్, ఏప్రిల్ 15 : బ్యాంకులోని సెంట్రల్ ఏసీ కారణంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కరణ్‌కోట ఎస్‌బీఐలో భారీ అగ్నిప్రమాదం మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని కరణ్‌కోటలోని (సీసీఐ టౌన్) షిప్‌లోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో ఉదయం మేనేజర్ భూవన్ మోహన్ తోపాటు సెక్యూరిటీ గార్డు వచ్చి బ్యాంకు తాళం తీశారు. బ్యాంకులో నుంచి పెద్ద ఎత్తున పొగతోపాటు మంటలు అలుముకోవడంతో సీసీఐ కాలనీ వాసులు, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. సీసీఐ టౌన్‌షిప్ మొత్తం పొగతో కుమ్ముకున్నది. విషయం తెలుసుకున్న కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి జలేందర్ రెడ్డి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఫైర్ ఇంజిన్ అందుబాటులో లేకపోవడంతో కొడంగల్ నుంచి రప్పించారు. అప్పటికే మంటలు ఎగిసి పడుతున్నాయి. సమీపంలోని పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ సమీపం నుంచి మూడు ట్యాంకర్ల ద్వారా నీళ్లు తెప్పించి, మంటలు అదుపు చేసేందుకు కృషి చేశారు. అగ్నికి బ్యాంకులోని ఫర్నిచర్, కంప్యూటర్లు, ఇతర వస్తువులన్నీ కాలిబూడదయ్యాయి. రూ.60 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బ్యాంకు అధికారులు, పోలీసులు అంచనా వేశారు. బ్యాంకులోని లాకర్‌కు ఎలాంటి ప్రమాదం జరుగలేదని, లాకర్‌లోని డబ్బు, బంగారం, ఇతర వస్తువులన్నీ భద్రంగా ఉన్నట్లు బ్యాంకు మేనేజర్ స్పష్టం చేశారు. మూడు గంటల పాటు శ్రమించి అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను ఆర్పివేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.60 లక్షల ఆస్తినష్టం

అగ్ని ప్రమాదంలో రూ.60 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బ్యాంకు మేనేజర్ భూవన్ మోహన్ తెలిపారు. బ్యాంకులో 8 గ్రామాలకు చెందిన రైతుల పాసు పుస్తకాలు, డబ్బు, బంగారం లాకర్‌లో భద్రంగా ఉన్నాయని తెలిపా రు. ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన స్పష్టం చేశారు.

వెలిజర్లలో ఆయిల్ పామ్ సాగు పరిశీలన

ఆయిల్ పామ్ సాగును పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్, ఏప్రిల్ 15 : ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్లలో రైతు నర్సింహారెడ్డి సాగు చేసిన ఆయిల్‌పామ్ సాగును జాతీయ పరిరక్షణ బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీహెచ్ వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగులో ఎదురవుతున్న సవాళ్లను ముందుగానే గుర్తించి సమర్థవంతంగా లక్ష్యాలను సాధించేందుకు వీలుగా క్షేత్ర ప్రదర్శన ఉపయోగపడుతుందన్నారు. శాస్త్రవేత్తలు, ఉద్యానవనశాఖ అధికారుల పర్యవేక్షణలో నర్సింహారెడ్డి సాగు చేసిన 13.30ఎకరాల ఆయిల్ సాగును పరిశీలించారని, ఆయిల్ పామ్‌లో అంతర పంటగా బొప్పాయిని పండించారన్నారు. కార్యక్రమంలో తెలంగాణకు సంబంధించి జాతీయ పరిరక్షణ బృందం హైదరాబాద్‌లోని ఆయిల్ సీడ్స్ అభివృద్ధి డైరెక్టరేట్ డైరెక్టర్ పొన్నుసామి, అశ్వారావుపేటలోని శాస్త్రవేత్త డాక్టర్ విజయకృష్ణ, ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ సరోజిని, ఆయిల్ పామ్ విభాగం అధికారి మల్లారెడ్డి, ఉద్యానవనశాఖ అధికారిణి హిమబిందు, ఆయిల్ సీడ్స్ అభివృద్ధి డైరెక్టరేట్ అధికారులు, ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొన్నారు.